# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ నిర్మాణంలో రైతులు శక్తివంతమైన భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఈరోజు తెల్లవారుజామున భోగి మంటలతో ప్రారంభమయ్యాయి.
- ❖ రాష్ట్రంలో వైద్యసేవలను విస్తృత స్థాయిలో అందించడానికి పి.పి.పి. విధానం అత్యంత అనుకూలమని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.
- ❖ భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో భారత్ ప్రత్యర్థికి 285 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

======================

రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని.. వారిని మరింత శక్తివంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ నివాసంలో ఈరోజు ఏర్పాటు చేసిన పొంగల్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడులతో కలిసి పాల్గొన్నారు. వేడుకల అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ... కొన్ని నెలల క్రితం సహజ వ్యవసాయంపై తమిళనాడులో జరిగిన ఒక సమావేశానికి తాను హాజరైనట్లు చెప్పారు. అక్కడ లాభదాయకమైన వృత్తులను వదిలి వ్యవసాయం వైపు మళ్లిన యువతను కలిశానని, వ్యవసాయ రంగంలో విప్లవాన్ని తీసుకురావడానికి వారు చేస్తున్న కృషిని మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దేశంలో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత వంటివి అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

=====================

రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఈరోజు తెల్లవారుజామున భోగి మంటలతో ఆనందోత్సాహాల మధ్య ప్రారంభమయ్యాయి. పిల్లలు, పెద్దలు వారి కుటుంబ సభ్యులు బంధు మిత్రులతో కలిసి చలి చీకట్లను ప్రాలదోలి వెలుగురేఖలు నింపే వెచ్చదనాన్ని ఆస్వాదించేందుకు భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఇంటి ముంగిళ్ళను మహిళలు రంగు రంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. చిన్నారులు గాలిపటాలు ఎగరువేస్తూ సందడిగా గడిపారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల ఆటల పోటీలు ఇలా రాష్ట్రంలో ఎటు చూసినా పండుగ శోభ వెల్లివిరిసింది. సంక్రాంతి పండుగలో ప్రధాన ఘట్టమైన భోగి త్యాగానికి సూచిక. పాత, నిరుపయోగమైన వస్తువులను మంటల్లో వేసి.. కొత్త జీవన మార్గానికి శ్రీకారం చుట్టడం ఈ పండుగ ముఖ్య ఉద్దేశం. అలాగే సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ముందు రోజు కావడం వలన.. ప్రకృతికి కృతజ్ఞత వ్యక్తం చేసే పండుగగా దీనిని భావిస్తుంటారు.

=====================

తెలుగు లోగిళ్లలో భోగి పండుగ జరుపుకుంటున్న రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు ప్రతీ ఒక్కరికీ కొత్త వెలుగులు తేవాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. ఈరోజు ఉదయం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో జరిగిన భోగి వేడుకల్లో ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలను కుటుంబ సభ్యులతో కలిసి ఆసక్తిగా తిలకించారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ సంక్రాంతి తెలుగువారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభమంగళాలను ప్రసాదించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

విరామం

=====================

వైద్య, ఆరోగ్య సేవల్ని ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో అందించడానికి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) విధానాన్ని అవలంబించాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. ఈ మేరకు పిపిపి మోడల్‌ను అనుసరించడంపై వివరణాత్మకమైన లేఖను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా లేఖ రాశారు. లేఖతో పాటు వివిధ సేవలను గరిష్ట స్థాయిలో పిపిపి ద్వారా అందించడానికి 27 పేజీలతో కూడిన మార్గదర్శకాలను వివరించారు. వైద్య విద్యను విస్తరించడానికి పిపిపి విధానం అత్యంత అనుకూల సాధనమని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి. నడ్డా రాష్ట్రానికి ఇటీవల రాసిన లేఖను ప్రస్తావించారు. దానికి అనుబంధంగా రెండవ లేఖను రాస్తున్నట్లు విజయ్ నెహ్రా తెలిపారు. వైద్య సేవల డిమాండ్, లభ్యతల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూరించడానికి 5 అంశాలకు సంబంధించి పిపిపి విధానాన్ని అమలు చేయడంపై కేంద్ర ఆరోగ్య శాఖ పలు అంశాలకు సంబంధించి సూచనలు చేసింది.

=====================

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని తిరుపతి జిల్లాకు చెందిన రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేంద్రీయ ఎరువులతో సహజ వ్యవసాయం చేస్తూ.. ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే మరోవైపు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నామన్నారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఎలాంటి ఎరువులు, రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపైనే ప్రత్యేక దృష్టి సారించామని ఆకాశవాణితో మాట్లాడుతూ చెప్పారు. తమతో పాటు వేల మంది రైతుల్లో ఈ చైతన్యం తీసుకువచ్చామని ఆదర్శ రైతు పద్మావతి వెల్లడిస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

=======================

రైళ్లలో ఇకపై కాఫీ, టీ విక్రయించే సామగ్రి కొత్త తరహాలో రానుంది. పానీయాల కోసం ప్రయాణీకులకు అమ్ముతున్న కాఫీ, టీ కెటిళ్లు పరిశుభ్రంగా లేవని వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వివిధ స్థాయిల్లో పరిశీలన చేసిన అనంతరం వాల్తేర్ డివిజన్ కొత్త ఆలోచన అమలుకు శ్రీకారం చుట్టింది. కొత్త వెండింగ్ ఫ్లాస్క్ లతో ఇకపై విక్రయదారులు రైలు బోగీల్లో కనిపిస్తారని... కాఫీ, టీ, సూప్ వంటి పానీయాలు I.R.C.T.C ద్వారా విక్రయించే వారు ఈ రకంగానే ఉంటారని వాల్తేర్ రైల్వే డివిజనల్ మేనేజర్ (D.R.M) లలిత్ బొహ్రా తెలియజేశారు. ప్రయోగాత్మకంగా ఈ తరహా అమ్మకాలను తొలుత ఏపీ ఎక్స్ ప్రెస్ లో ప్రవేశపెడుతున్నామని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

=======================

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్‌లో భాగంగా ఈరోజు రాజ్ కోట్ వేదికగా రెండో మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. భారత బ్యాట్స్‌మెన్ లలో కే.ఎల్. రాహుల్ 92 బంతుల్లో 112 పరుగులు చేసి అజేయంగా నిలవగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 56 పరుగులు చేసి సిరీస్ లో రెండో అర్ధ శతకం నమోదు చేశాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జేమీసన్, ఫౌక్స్, జేడెన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్‌వెల్ ఒక్కో వికెట్ తీశారు. 285 పరుగుల లక్ష్య ఛేధన ప్రారంభించిన న్యూజిలాండ్ కడపటి వార్తలు అందేసరికి 6 ఓవర్లకు ఒక వికెట్ నష్టపోయి 24 పరుగులు చేసింది. ఇప్పటికే తొలి మ్యాచ్ లో విజయం సాధించి భారత్ సిరీస్ లో 1-0 తో ఆధిక్యంలో ఉంది.

=======================
=======================